ముగిసిన కట్ట పుట్టాలమ్మ జాతర

● వైభవంగా నాగహారతి ఊరేగింపు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి చెరువు కట్ట కింద వెలిసిన శ్రీ కట్ట పుట్టాలమ్మ జాతర రెండు రోజులపాటు కోలాహలంగా జరిగింది. జాతరలో భాగంగా చివరి రోజు బుధవారం తెల్లవారుజామున వంశ పారంపర్య ధర్మకర్త రామచంద్రయ్య, వాసు ఇంట్లో నాగహారతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేరళ వాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా నడుమ పుట్టాలమ్మకు సారె తీసుకుని, నాగహారతితో వైభవంగా ఊరేగుతూ ఆలయానికి చేరుకున్నారు. దొడ్లమిట్ట, కరకంబాడి గ్రామాల్లో అడుగడుగునా భక్తులు నాగహారతికి పొర్లు దండాలు పెట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి నాగహారతి పట్టారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు రోజులు పాటు జరిగిన కట్ట పుట్టాలమ్మ జాతర కోలాహలంగా ముగిసింది.


ఆలయ ప్రాంగణంలో పోటెత్తిన భక్తులు


నాగ హారతిని తీసుకొస్తున్న ధర్మకర్తలు


పుట్టాలమ్మకు సారె తీసుకొస్తున్న మహిళలు


ఊరేగింపులో చిన్నారుల కోలాటాలు

వెంకన్న హుండీ ఆదాయం రూ.12.30 లక్షలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకల రూపంలో రూ.12,30,805 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం ఆలయంలోని హుండీ కానుకల పరకామణి నిర్వహించినట్లు తెలిపారు. రెండున్నర నెలలకు గాను పైఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య పర్యవేక్షణలో సిబ్బంది పరకామణి నిర్వహించినట్లు నాగరాజు తెలిపారు.

ఆర్.మల్లవరంలో మిషన్ శక్తి సంకల్ప

రేణిగుంట: ఆర్.మల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణవేణి ఆదేశాల మేరకు బుధవారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమణ, సూపర్‌వైజర్ హేమావతి, రాస్ కోఆర్డినేటర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రేఖ, మునేశ్వరి, విమల, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో గురువారం ఉదయం 9 గంటలకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. ఈ వేడుకలకు సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, బీరేంద్రవర్మ హాజరవుతారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు హాజరుకావాలని చెప్పారు.

విద్యాసామగ్రి వితరణ


విద్యాసామగ్రి అందుకున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్య కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 20మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థులకు స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ బుధవారం రూ.40వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిల్ వంటివి విద్యాసామగ్రిని వితరణగా అందజేశారు. స్కూల్‌మేళా కో–ఆర్డినేటర్, హెచ్‌ఎం పోతురాజు, ఉపాధ్యాయులు శిరీష, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి


చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీఎస్ పురం గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోతి తెలిపారు. బుధవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలోని చెత్త సేకరణ కేంద్రం వద్ద గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఏపీఎం మునెయ్య, ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

ఆడ పిల్లలను సంరక్షించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: ఆడపిల్లలను పుట్టనిద్దాం..చదవనిద్దాం..ఎదగనిద్దాం అని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమావేశ హాల్‌లో భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ దేవకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని, బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించినా జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎం రమణయ్య, సూపర్‌వైజర్లు యమున, జ్యోతి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ


క్రీడా దుస్తులు ఇస్తున్న దాత గిరిరెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గిరిరెడ్డి తన స్వంత నిధులతో క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం జయసుధ చేతుల మీదుగా ఆయన అందజేశారు. పీడీ బందిలకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన కళాశాల ఉద్యోగి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామయ్య అనే ఉద్యోగి బుధవారం కళాశాల ఆవరణలో పాముకాటుకు గురయ్యాడు. రామయ్య కళాశాలలోని గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తుంటాడు. బుధవారం యథావిధిగా నిర్వహణలో పుస్తకాలు సర్దుతుండగా పాము కాటుకు గురయ్యాడు. సహచరులు గుర్తించి హుటాహుటిన రామయ్యను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాలలోని హాస్టల్‌లో దోమలు రాకుండా ఉండడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మోతి తెలిపారు. ఆమె బుధవారం ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, సీహెచ్‌ఓ వెంకటేశులుతో కలిసి హాస్టల్స్ పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి వాసికి యోగా జ్యోతి అవార్డు


అవార్డు అందుకున్న ఆయిలం సుజాత

శ్రీకాళహస్తి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని రోటరీ బెంగళూర్ గ్లోబల్ యోగా, రోటరీ క్లబ్ ఆఫ్ బెంగళూర్ కల్యాణ్, యోగా యూనివర్సిటీ ఆఫ్ అమెరికన్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన యోగా మాస్టర్ ఆయిలం సుజాతకు యోగా జ్యోతి అవార్డు అందుకున్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని యోగా సాధనలో సేవ చేస్తున్న మాస్టర్లకు అవార్డులు అందజేశారు.

ఫార్మ్ పాండ్ ఓ వరం


పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకంలో పంట సంజీవని, ఫార్మ్ పాండ్ రైతుల పాలిట వరమని పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం వేణుగోపాలపురంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలు నష్టపోకుండా ఉండడం కోసం ఎన్‌ఎంఎంఎస్ హాజరు పట్టిలో 100 శాతం పారదర్శకత పాటించాలన్నారు. ఉపాధిలో పాడి రైతుల కోసం ఫాడర్, పశుగ్రామ పెంపకాన్ని చేపట్టవచ్చునని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచకుంటే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఇళ్ల వద్ద నున్న వర్మికంపోస్టు పిట్‌లను పరిశీలించారు. ఏపీఓ దేవరి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

సంకల్పంపై అవగాహన


మాట్లాడుతున్న శ్రీదేవి

నాగలాపురం: బీరకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి పిల్లలకు సీడీపీఓ సౌభాగ్యమ్మ అధ్యక్షతన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని 18 ఏళ్ల లోపు బాలికలకు పెళ్లి జరిగితే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. హెచ్‌ఎం హేమకుమార్, టీచర్లు సత్యవేణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే పేరుతో వేధింపులు

శ్రీకాళహస్తి: మండలంలోని అమ్మ చెరువు గ్రామ రైతులను రీసర్వే పేరుతో రెవెన్యూ యంత్రాంగం వేధిస్తోందని గ్రామస్తులు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు దృష్టికి వారి సమస్యలను ఏకరవుపెట్టారు. ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ మోహన్‌రెడ్డి నాటిన సర్వే రాళ్ల మీద ఉన్న ఆయన ఫొటోలు తొలగించిన దానిమీద ఉన్న శ్రద్ధ రైతులకు రీ సర్వే జరిగిన వాటిని పట్టాదారు పాస్ పుస్తకాలు 1బీలు ఇచ్చే పరిస్థితి లేకుండా ఉందన్నారు. ఇప్పటికైనా రీ సర్వే జరిగిన గ్రామాల రైతుల సమస్యలు శ్రద్ధ వహించి పరిష్కరించాలన్నారు.

గడ్డివాము దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివాము

వరదయ్యపాళెం: మండలంలోని కళత్తూరుకు చెందిన రైతు దాదిరెడ్డి సురేష్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం ఇంటికి సమీపంలోని గడ్డివాము నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. స్పందించిన శ్రీసిటీ పారిశ్రామికవాడలోని అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే వాము పూర్తిగా కాలినట్లు బాధిత రైతు వాపోయాడు. రూ.3లక్షలకు పైగా విలువ కలిగిన 800 గడ్డి మోపులు దగ్ధమైనట్లు రైతు అధికారులకు ఫిర్యాదు చేశాడు.

రాణెమ్మకు నివాళి


నివాళులర్పిస్తున్న రోజా, నూకతోటి

నాగలాపురం: స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా పెద్దమ్మ రాణెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు రాణెమ్మకు బుధవారం కర్మక్రియలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఆర్‌కే రోజా, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరై రాణెమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

లింగ వివక్ష రూపుమాపుదాం


మాట్లాడుతున్న సౌభాగ్యమ్మ

నారాయణవనం: సమాజంలో లింగ వివక్షను పూర్తిగా రూపుమాపుదామని పలువురు అన్నారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రాజెక్ట్ అధికారి సౌభాగ్యమ్మ మాట్లాడుతూ చదువుకునే వయస్సులో వివాహాలతో బాలికల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా అనారోగ్య పిల్లలకు జన్మనిస్తారని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్షపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. హెచ్‌ఎం మనోహరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, గుడ్, బ్యాడ్ టచ్, రక్షణ కల్పించే చట్టాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్సీలపై దాడులు అమానుషం


ఓబులేషును సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయని ఉమ్మడి జిల్లా ఎస్సీసెల్ ఇన్‌చార్జ్ ఓబులేషు అన్నారు. తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ గురువారం జరగనున్న నేపథ్యంలో శ్రీకాళహస్తి ఎస్సీ నేతలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని శ్రీకాళహస్తిలో కలిసి ఎస్సీల సమావేశం విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

నేటి నుంచి ఏపీటీఎఫ్ నిరసన వారం


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి నిరసన వారం కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ నేటి కూటమి ప్రభుత్వం 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కె.వెంకటాద్రి మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కమిటీ నిర్ణయానుసారం నిరసన వారంగా ఉద్యమ కార్యాచరణ జరుగుతున్నందున ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నేతలు ఆర్.గోపాల్, పీడీ చంద్రశేఖర్, రామదాసు, రమేష్, ఉదయ్‌కుమార్, సురేష్, శివ, సుబ్రహ్మణ్యంరెడ్డి, పెరుమాళ్, మునుస్వామి, సుధాకర్, మునిరాజా పాల్గొన్నారు.

గుత్తివారిపల్లెలో రాస్ సేవలు


ఆహారం పంపిణీ చేస్తున్న రాస్ ప్రతినిధులు

రేణిగుంట: రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం సూచనల మేరకు రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో బుధవారం రాస్ ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించింది. గత వారం డయేరియా వల్ల ఇబ్బందులు పడ్డ గ్రామస్తులకు భోజనం, మంచినీటిని పంపిణీ చేశారు. పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు మాట్లాడుతూ రాస్ ఆధ్వర్యంలో ప్రతినెలా జరుగుతున్న వైద్య అవగాహన సదస్సును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ మంజుల, రాస్ సిబ్బంది కరుణాకర్, మునిరాజా, రామాంజనేయులు, నాగరాజు, బాలాజి, వెంకటేష్, రాణి, శైలజ, భారతి పాల్గొన్నారు.

శ్రీసిటీ నర్సరీలో చిన్మయ విద్యార్థులు


భగవద్గీత పారాయణం చేస్తున్న విద్యార్థులు

శ్రీసిటీ(వరదయ్యపాళెం): విజ్ఞాన యాత్రలో భాగంగా చిన్మయ విద్యాలయ విద్యార్థులు బుధవారం శ్రీసిటీ నర్సరీని సందర్శించారు. 2వ తరగతికి చెందిన 108 మంది విద్యార్థులు విచ్చేయగా, శ్రీసిటీ ఉద్యానవన అధికారి పవన్‌కుమార్ వారికి నర్సరీలోని వివిధ మొక్కలు, వాటి విశిష్టతను వివరించారు. విద్యార్థులు నర్సరీ ఆవరణలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆసీనులై భగవద్గీత పారాయణం చేశారు. సందర్శనకు వీలుగా అన్ని వసతులు సమకూర్చి తమకు అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం మండల ఎంఈఓ జనార్దనరాజు, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ బాబు ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15,16 తేదీల్లో అండర్–14, అండర్–17 కేటగిరి స్కూల్ పిల్లలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, షెటిల్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజినల్ స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు.